# జీవపరిదేవనము

కూచి నరసింహం పంతులుగారు

తండ్రీ! రామచంద్రప్రభూ! నిన్నే నా యిష్టదైవతమును జేసికొని చిరకాలమునుండి భజించుచున్నాను. మనుష్యుఁ డెట్లు దేవుఁడు కాఁగలఁడు? అను యుక్తివాదశులు నన్నెంత యూఁపి యూటాడింపఁ జూచుచున్నను అవ్యక్తభగవత్తత్త్వము గ్రహింపఁజాలని మందబుద్ధి నగుటచేతఁ గాఁబోలు నీపాదారవిందములపై వ్రాలిన నా మనస్సు మరలింప లేకున్నాను. నీవు గొప్ప భగవదవతారపురుషుఁడవనియును నీనామము తారకనామమనియును నేనింకను విశ్వసించుచున్నాను. "ఎవఁడు నన్నే రూపముతో నేనామముతో సేవించునో వానియభీష్టము లారూపముతోను ఆనామముతోను నేను నెఱవేర్చెదను" అను గీతాప్రతిజ్ఞ ఆవిశ్వాసమును బలపఱచుచున్నది. శ్రీగాంధిమహాత్మునికి రామనామమహిమయందుండు నమ్మకము "నీవు తప్పుత్రోవ ద్రొక్కుటలే"దని నన్నెచ్చరించుచున్నది. భగవంతుఁ డున్నాఁడో లేఁడో అను వారిని జూచితిని గాని రాముఁడు లేఁడను వారిని మాత్రము నేఁజూడలేదు.

"ఓరీ! అఱువదియేనిమిదవయేఁట నీపిచ్చియుపోద్ఘాతప్రలాపము లేమి?" యని యడిగెదవేమో, విను, విన్నవించుకొనెదను.

నీవు నన్నుఁ బుట్టించిన కుటుంబము ధనసత్కుటుంబము గాకపోయినను సత్కుటుంబము. నా తండ్రియును పినతండ్రులును తల్లియును జిన్నమేనత్తయును భగవద్భక్తులు, జ్ఞానసంపన్నులు. అందు నా పెద్దపినతండ్రి అఖండరామభక్తుఁడు. నీపవిత్రనామ మాయన జిహ్వపై నెప్పుడును తాండవమాడుచుండెడిది. ఆయన పిచ్చియే కొంతవఱకు నాకును అంటినది. ఆయనకుండిన యవ్యాజకుటుంబానురాగమును స్వార్థత్యాగమును జూచియే యేకాకినగు నేను కుటుంబసంగపాశములలోఁ జిక్కి పడియున్నాను. నాబాల్య యౌవన కౌమారములు నీకృపవలన సుఖముగాఁ గడచినవి. నాయం దత్యంతప్రేమగల నా పెద్దతమ్ముని అకాలమృత్యువు, తన నోటనైచుకొనినను, నా సత్కళత్రముయొక్క సానురాగానునయపోషణములచేఁ గొన్నాళ్ళ కాదుఃఖము దిగమ్రింగి తేఱుకొన్నాను. తఱువాత మఱిరెండు పెద్దదెబ్బలు పైనిబడినవి. కంటిని ఱెప్పవలె నన్నుఁ గాచుకొనుచుండు నా భార్య పరమేశ్వరీసన్నిధానమునకుఁ జనినది. ఆదుఃఖము చల్లారకముందే, నన్నుఁ గడు భక్తిప్రేమములతోఁ గనిపెట్టుకొని చూచుచుండిన కనిష్ఠసోదరుఁడు కూడఁ గను మొఱఁగి నాకలోకమునకుఁ బోయినాఁడు. ఇల్లంతయుఁ జీకఁటి యైనది. నాముప్పుగడుపునని యెవనిపై నేనాశపెట్టుకొనియుంటినో వాఁడు, వలవలయేడ్చుచున్న తనభార్యను, తల్లి యేల యేడ్చుచున్నదో యెఱుఁగని ముగ్ధశైశవములోనున్న యొకకొడుకును, గూఁతును "నీవు పోషింపు"మని నాతో చెప్పకచెప్పి పాఱిపోయినాఁడు. సన్యసించుటకుఁ గావలయు వైరాగ్యము నాకు లేకపోవుటచేతను, తండ్రిలేని యాపిల్లలను బోషింప శ్రమపడి యార్జించుటకుఁజాలిన జవసత్త్వము లింక నుండుటచేతను, అది నీ యాదేశమేయని భావించి యింతవఱకును లోటేమియు లేకుండ వాండ్రసంసారము సాగునట్లు చేసినాను. ఉభయులకును బెండ్లిండ్లయినవి. కుమారుఁడు నీయనుగ్రహము వలన నాలుగు నెలలలోఁ బరీక్షయందుఁ జరితార్థుఁడయి స్వతంత్రజీవనసామర్థ్యమును సంపాదించుకొని యింటికి రావచ్చును.

ఇట్లుండఁగా నొక మహావిపత్తు తటస్థింపఁ జేసినావు. ఎంతో యనురాగముతోఁ బెంచిన ఆయాఁడుపిల్ల, చిన్నప్పుడు పీఠియుఱుఁగుమీఁదఁ గూరుచుండి నాతో భజగోవింద శ్లోకములును భక్తికీర్తనలు పాడుకొనుచుండెడు బిడ్డ—అన్నపూర్ణ—పదునాఱు రోజులు చెప్పరాని బాధపడి కడచిన సోమవారము నాఁడు గతించినది. ఈదుఃఖ మెట్లు భరింపఁగలనో యెఱుఁగను. ఇంకను బ్రతుకవలయునను ఆశ దానికుండెను. పందొమ్మిదేండ్లింకను నిండని పసికూనపుఁ బ్రాణముపై ఆమాత్రపు తీపియుండుట విపరీతము గాదు. కాని దాని మరణములో వివేకులకు పెద్దలకుఁగూడ వింతగొల్పెడు ధైర్యచిహ్నములు కొన్ని

గలవు. రోగము బహుదోషయుక్తమగు టైఫాయిడ్ జ్వరమైనప్పటికిని, చచ్చిపోవువఱకు స్మృతి, నిర్మలముగానుండెను. కష్టసహనశక్తి అత్యద్భుతము. ఎంత బాధపడుచుండినను "అమ్మా! నీబాధ యెట్లున్నది?" అని యడిగినప్పుడు "కొంచెము నెమ్మదిగా నున్నది నాన్నగారూ!" అని స్ఫుటమైన వాక్కుతో చెప్పెడిది. నామనస్సు కళవళపడునని యట్లు పలికెడిది గాని బాధతగ్గుటచేత గాదు. నాకును భర్తకును తల్లికిని అన్నకును వదినెకును ఇతరులకును జెప్పిన చివరహితోక్తులు మహా వివేకసూచకములు. మృతిభీతి అణుమాత్రమైన నగపడలేదు. భగవన్నామోచ్చారణము చేయుచుఁ బ్రాణములుఁవిడిచిన యాయద్భుతవ్యక్తిని జూచి "అన్నయ్యా! మనస్వామి గీతలోఁజెప్పిన స్థితప్రజ్ఞురాలుగాఁ గానిపించుచున్నదినుమా" యని నాతమ్ముఁడన్నాఁడు. పుట్టినింటికిని మెట్టినింటికిని కీర్తి తెచ్చిన యాపిల్లప్రాణములు నిల్పుకొనుటకై నాస్థితిలో నున్నవానికి సాధ్యమైన యావత్ప్రయత్నములను చేసినాను. కన్నీళ్లతో నిన్నుఁ దలఁచుకొని ప్రార్థించినాను. జపమాలపై నీనామమనేకపర్యాయములు జపించినాను. అంతయును బూడిదలోఁ బోసిన పన్నీరైపోయినది. కారణమేమో నీవే చెప్పవలెను.

'నీడబ్బు దోష' మందువా? నేనార్జించిన ద్రవ్యములో నొకదమ్మిడియైనను అన్యాయార్జితము లేదని నీయెదుట నిలఁబడి నీమీఁద నొట్టుపెట్టుకొని చెప్పఁగలను. "నీకర్మ" మందువా? కర్మము జడము. అదేమి చేయఁగలదు? సర్వశక్తుఁడవును సర్వాధికారివిని అగు నీకు కర్మముపై నధికారముండదా? దుష్కర్మఫలమును గొట్టివేయఁజాలినశక్తి నీకులేదా? ఉన్నది. ఉండియును కర్మముపేరుచెప్పి జీవులనిట్లు నీయిష్టము వచ్చినట్లు త్రిప్పులఁబెట్టుచున్నావు. "నేనొక రాజమాత్రుఁడను గాని భగవంతుఁడను గాను రా" నెట్టివాఁడా! నిరపరాధుఁడగు వాలిని నిర్దోషుఁడగు శూద్రతపస్విని జంపినాననియు, మహాసాధ్వియును గర్భవతియునగు కాంతను గాంతారముల పాలుచేసినాననియు, నాలోపము నెంచుచున్నారు ప్రజలు. భగవంతుఁడు నాపైవాఁడు. అతని సేవింపు" మం [illegible]? ఈ బొల్లిమాటలకు నే లొంగను. ఎట్లో నీబాధ్యత తొలఁగించుకొనవలెనని మృషావాక్యము లాడుచున్నావు. అమూర్తిమంతుఁడును అదృశ్యుఁడును నైన భగవంతుఁడు సృజించిన సృష్టిలో మాత్రము వైషమ్యనైర్ఘృణ్యలక్షణము లెన్ని కనఁబడుటలేదు? లయకర్తయును రక్షకుఁడును ఒక్కఁడే యెట్లు కాఁగలడు? నీచరిత్రలోని సందేహములకంటె సృష్టికర్తచరిత్రలోని సందేహము లెక్కువగాఁ గానిపించుచున్నవి. నీవే ఆభగవంతుఁడవు. లోకరక్షణార్థము మనుష్యుఁడవై పుట్టితివి. మాయతో మావంటి మనుష్యునివలె నటించితివి. అంతే. ఆభావన నాకుఁబోదు. అది నాప్రారబ్ధము. కొట్టినతల్లి నమ్మనే మఱింతగట్టిగా నంటిపట్టుకొను బక్కశిశువువలె నేను నిన్ను వదలలేను. ముంచినను నీవే. తేల్చినను నీవే!!

నీవు దుర్విజ్ఞేయుఁడవు. "యస్యానుగ్రహమిచ్ఛామి తస్యవిత్తం హరామ్యహమ్" అన్న దయామయుఁడవు. నీమాయ యంతకంటెను దుర్విజ్ఞేయము. నీమాయలోఁ బడవైచి నన్ను బాధింపకుము. ఇఁక నట్టి బాధలు పడుటకుఁ జాలిన దేహబలమనోబలములు లేవు. ప్రేమచేతనే నేను జెడిపోవుచున్నానని నీకుఁదోఁచు నెడల, ఱాతిగుండెయే సుఖజీవనమున కావశ్యకమగు నెడల, నట్లే నన్నుఁ బాషాణహృదయునిజేసి నాకు మనశ్శాంతి నొసఁగుము! నీయందు నాకుండు భక్తిని శుద్ధముచేసి దృఢీకరించి నన్ను నీయక్కున జేర్చికొనుము. మమ్మందఱను దుఃఖసాగరములోఁ ముంచిపోయిన మాఅన్నపూర్ణ ఆత్మకు ప్రశాంతిసుఖములను మోక్షానందమును బ్రసాదింపుము. తండ్రీ! యివే నీకు నాశతసహస్రవందనములు!

మ. వృకసందోహము పొంచియుండి పొలమం దేకాకిగానుండు వృ
ద్ధకకుద్మంతముపైకి దూఁకుగతి దుర్దాంతాఘులున్వ్యాధులున్,
జకితస్వాంతతనుండ నన్నఱిమి యేఁచ న్జొచ్చె! గోపాలనా
మక! రక్షించుట కీవె శక్తుఁడవు రమ్మా! రామచంద్రప్రభూ!

శా. వంతంబెట్టెడు చిత్తవృత్తులను జంపన్నీశుభాఖ్యోత్కరం
బెంతో శ్రద్ధ జపింపఁజూడ సకటా యేయొక్కెడన్నిల్వకీ
స్వాంతంబన్కపి యిచ్చవచ్చినటు సంచారంబు గావించెడున్
శాంతిస్థైర్యములిమ్ము దానికి రమేశా! రామచంద్రప్రభూ!

శా. బాధస్రోతలు నన్యులెక్కఁడుఁగ సేవల్సేయు నావశ్యమున్
క్రోధం బిట్టివిలేని సన్మతియు, హృత్కోశంబునందద్ధుస
ర్వాధివ్యాధిహరత్వదీయ శుభదివ్యాంఘ్రిద్వయి న్నిల్పుకొం
చేధైర్యంబుననుండు పాటవము నీవే! రామచంద్రప్రభూ!

మ. అనుతాపాగ్నిమదీయ కిల్బిషవనం బామూలదాహంబుచే
సినవెన్కన్భవదీయ భవ్యగుణసంస్మృత్యాదులంబిట్టునా
కనులంబుట్టు సుశీతలాశ్రుతతి నాకాఁకన్శమింపంగఁజే
సి ననున్భక్తి సుధాబ్ధిఁదేల్పఁగదవే! శ్రీరామచంద్రప్రభూ!

శా. నీపాదాంబుజచింతనాభ్రధునిలో నే స్నానముంజేసినా,
పాపౌఘంబులఁ గడ్గివైచుకొని శుభ్ర స్వాంతతన్నిల్చి నీ
రూపంబున్మదిఁగట్టి మృత్యువును మిత్రుంబోలె రావోయి! యం
చాపద్బాంధవ! పిల్చునిర్భయతనీవా! రామచంద్రప్రభూ!

——:0:——

## పుత్రుఁడు

త్రిపురాన సత్యానందరావుగారు

తల్లిని సతంబు ప్రేమించు తనయుఁడెందు
ఏకపత్నీవ్రతుండగు; నిది ధ్రువంబు.
తండ్రిని సతంబు ప్రేమించు తనయ యెందు
పుణ్యసాధ్వీమతల్లియౌఁ బుడమిపొగడ.
తల్లిదండ్రులఁ బ్రేమించు దంపతులు జ
గత్పితరులై మనియెదరు గౌరవమున.
తల్లిదండ్రుల ప్రేమతత్త్వంబు నెఱుఁగ
తల్లి, తండ్రియుఁగావలెఁ దానుగూడ;
తల్లి, తండ్రియుఁ దానౌట తగనెఱింగి
తల్లిదండ్రులనడుమను దాఁటిపోవు
నతఁడె పో పుత్రుఁడమలుండు నవనియందు